క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రవినాయక్‌ను గురువారం కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నిజమైన అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా అమ్మవారి వార్షికోత్సవం



నవాబుపేట: మండలంలోని మైసమ్మ దేవాలయ వార్షిక ఉత్సవాలు గురువారం ప్రారంభించారు. అమ్మవారి ఆలయంలో గణపతిపూజా, కలశస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం చండీహోమం నిర్వహిస్తున్నట్లు దేవాలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సర్పంచ్ జంగమ్మ, కృష్ణయ్య, మాధవులు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలను తరలించాలని వినతి

భూత్పూర్: మున్సిపాలిటీలోని ఉన్న వీధికుక్కలను తరలించాలని ఆమ్‌ఆద్మీపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గడ్డం ఎల్లప్ప కమిషనర్ నజీబ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. చౌరస్తాలోని చికెన్, మటన్ దుకాణాల ముందు పదుల సంఖ్యలో కుక్కలు ఉండటంతో రాత్రి వేళల్లో పట్టణ ప్రజలు, మహిళలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంజి, కాశన్న పాల్గొన్నారు.

ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి పరిధి ఎంపీటీసీ సభ్యుడు శంకరయ్య భార్య లక్ష్మమ్మ బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కంచన్‌పల్లిలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బాలు, రఫిక్, సుదర్శన్, రవి, శివప్రసాద్, కాడయ్య, రాములు ఉన్నారు.

ఆకట్టుకున్న కళాజాతా



దేవరకద్ర: మండల కేంద్రంలోని పంచాయతీ భవనం వద్ద గురువారం కళాజాతా ప్రదర్శన ఆకట్టుకుంది. ఓటు హక్కు వినియోగం, తడి చెత్త, పొడి చెత్త పలు అంశాలపై ఆట పాటలతో ప్రదర్శన నిర్వహించింది. ప్రభుత్వ పథకాలపై, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయక్ష్మి, ఈఓ సీత్యానాయక్, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్లు నాసిరకంగా వేస్తే చర్యలు



కోయిల్‌కొండ: మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా చేపడుతున్న సీసీరోడ్లు పనులు నాసిరకంగా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ జయరాములు కాంట్రాక్టర్లను హెచ్చరించారు. గురువారం మండలంలోని రాజునాయక్ తండాలో వేస్తున్న సీసీరోడ్డును పరిశీలించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రభుత్వపాఠశాలను తనిఖీ చేశారు.

పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభం



గండేడ్: మండలంలోని కొంరెడ్డిపల్లి పంచాయతీ భవన నిర్మాణ పనులు గురువారం సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇది వరకు ఉన్న భవనం శిథిలావస్థలో ఉండడంతో పాటు అసౌకర్యంగా ఉండేదన్నారు. కొత్త భవనం మంజూరుకావడంతో పాలన సౌలభ్యంగా ఉంటుందన్నారు. త్వరలోనే నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసువస్తామన్నారు.

యథేచ్ఛగా నిబంధనలకు పాతర

- ఫిల్టర్ ఇసుక, రాతి పొడితో సీసీ రోడ్లు
- ఇసుక ధర పెరగడంతో నామమాత్రంగా పనులు



సీసీరోడ్లకు ఉపయోగిస్తున్న ఫిల్టర్ ఇసుక, రాతిపొడి



మాచన్‌పల్లిలో ఫిల్టర్ ఇసుక, రాతిపొడి, కంకర, సిమెంట్ మిశ్రమంతోనే వేస్తున్న సీసీరోడ్డు

మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పది కాలాల పాటు పటిష్టంగా ఉండాల్సిన పనులను కాంట్రాక్టర్లు నాణ్యతా లోపంతో చేస్తున్నారు. పరిశీలించాల్సిన పంచాయతీరాజ్ అధికారులు అటువైపే రాకపోవడంతో సదరు కాంట్రాక్టర్‌కు అడ్డు చెప్పేవారే లేరు.

లొసుగు ఆసరా..

ఇసుకను ఇష్టానుసారంగా తవ్వేస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ప్రభుత్వం రీచ్‌లలో ఇసుక తవ్వకాలను తగ్గించింది. ప్రస్తుతం ఇసుక రీచ్‌లు కొన్ని మాత్రమే కొనసాగుతున్నాయి. మరోవైపు ఇసుక ధరలు అమాంతం పెరిగాయి. అయితే సీసీరోడ్ల పనుల్లో వందశాతం ఇసుక వాడాలని పంచాయతీరాజ్ అధికారులు నిర్ణయించారు. రూరల్ మండలం మాచన్‌పల్లిలోని పలు వీధులలో సీసీరోడ్ల ఏర్పాటుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. రోడ్లకు సంబంధించి అదే గ్రామానికి చెందిన ఇద్దరు వార్డు సభ్యుల భర్తలు పనులను దక్కించుకున్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఫిల్టర్ ఇసుక, రాతిపొడితోనే చేస్తున్నారు. ట్రాక్టర్ వాగు ఇసుకకు రూ. 5,500 నుంచి రూ.6వేల మధ్య ధర పలుకుతుండడం, రాతిపొడి మాత్రం రూ.300 నుంచి రూ.3,300కే దొరుకుతుంది. ఫిల్టర్ ఇసుక రూ.2,500 నుంచి రూ.3వేలకే వస్తుంది. ఫిల్టర్ ఇసుక, రాతిపొడి, సిమెంట్, కంకర కలిపి నిర్మిస్తుండడంతో నాణ్యతా ప్రమాణాలపై అప్పుడే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాచన్‌పల్లిలోని సీసీ రోడ్డు బండ్రవల్లి నర్సింహులు ఇంటి నుంచి కృష్ణారెడ్డి ఇంటి వరకు, సీపీఎం జెండా నుంచి సాయిలు ఇంటి వరకు, వైఎస్సార్ విగ్రహం నుంచి బీటీ రోడ్డు వరకు పనులు మంజూరై సీసీరోడ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి.

రాతిపొడి వాడొద్దు

సీసీ రోడ్ల పనులు నాణ్యతతో చేపట్టాలి. మాచన్‌పల్లిలో కొనసాగుతున్న సీసీరోడ్ల పనుల్లో రాతిపొడిని వాడట్లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 25 శాతం రాతిపొడి వాడాలని ఉన్నా వాడట్లేదు. పనుల్లో వంద శాతం వాగు ఇసుకను వాడాలని నిర్ణయించాం. – రాములు, ఏఈ, పంచాయతీరాజ్, మహబూబ్‌నగర్ రూరల్

ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్



పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేస్తున్న డీఈఓ యాదయ్య

గండేడ్: ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్ ఉందని డీఈఓ యాదయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యాభివృద్ధి వేదిక మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో పాఠశాలకు అవసరమైన పోర్టబుల్ సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. కార్యక్రమానికి డీఈఓ హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న వసతులు, ఆకర్షణీయమైన వాతావరణం తదితర కారణాలతో తమ పిల్లలను చేర్పించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. వారు ప్రభుత్వ పాఠశాలలపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో పిల్లలను ఉత్తములుగా తీర్చి దిద్దడానికి గాను ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ బాలయ్య, హెచ్‌ఎం మాధవిలత పాల్గొన్నారు.

హాజరుశాతం తగ్గితే చర్యలు

మహమ్మదాబాద్: ప్రాథమిక పాఠశాలలో హాజరు శాతం తగ్గితే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని డీఈఓ యాదయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని నంచర్ల ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో 193 విద్యార్థులకు 63 మంది గైర్హాజరు అవడంపై మండిపడ్డారు. దీనిపై ఉపాధ్యాయులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంబేద్కర్ జాతర విజయవంతం చేద్దాం



అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు

జడ్చర్ల టౌన్: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్‌లో జిల్లా కేంద్రంలో నిర్వహించే అంబేద్కర్ జాతర విజయవంతం చేద్దామని జాతర కమిటీ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు ఇన్‌చార్జ్‌లను నియమిస్తున్నట్లు ప్రకటించారు. జాతర విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సామెల్, బాల్‌రాజ్, తుంగశ్యాం, నాగులు, వెంకటేస్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలానగర్: మండలంలోని హేమాజీపూర్‌లో వినాయక, కుమారస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవం రెండు రోజులుగా నిర్వహించారు. గురువారం శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ చైర్మన్ వాల్యానాయక్, ఎంపీపీ కమల పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సర్పంచ్‌కు పరామర్శ

కొంతకాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ ఇటీవల సర్జరీ చేయించుకున్న పెద్దాయపల్లి సర్పంచ్ శంకరప్పను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆపరేషన్ తీరును తెలుసుకుని డాక్టర్ల సూచనలతో త్వరగా కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు వచ్చి సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట శ్రీనివాస్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, తిరుపతి, భూపాల్‌రెడ్డి, రవినాయక్ ఉన్నారు.

ఉపాధ్యాయుల గొంతుకను మండలికి పంపండి



మాట్లాడుతున్న మాణిక్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకను మండలికి పంపాలని యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని మనికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో భాషా పండిట్, వ్యాయమ ఉపాధ్యాయుల పోస్టుల ఉన్నతీకరణ పూర్తి చేసి, తక్షణమే పదోన్నతులు కూడా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శాసన మండలిలో తన వాణిని వినిపిస్తానని అన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, రవికుమార్, కిష్టయ్య, హేమంత్‌కుమార్, చంద్రయ్య, శ్రీనివాస్ ఆర్య, రాధమ్మ, సవిత, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపడాలి



ఉపాధ్యాయులతో చర్చిస్తున్న కమిటీ సభ్యులు

హన్వాడ: పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యాశాఖ రాష్ట్ర మానిటరింగ్ కమిటీ సూచించింది. సభ్యులు గురువారం మండలంలోని హన్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్‌ఎస్ గొండ్యాల్, వేపూర్ ఉన్నత పాఠశాలతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్ని సందర్శించి విద్యార్థుల విద్యాప్రమాణాలను స్వయంగా తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మధుసూదన్‌రావు, రఘురాంరెడ్డి, వీరేశంగౌడ్, మదన్‌రెడ్డి, ఎంఈఓ రాజునాయక్ తదితరులు ఉన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ



చిన్నరాజమూర్‌లో గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న వైద్య సిబ్బంది

దేవరకద్ర: మండలంలోని చిన్నరాజమూర్, బస్వాయపల్లి, రేకులంపల్లిలో గురువారం మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలలో నిర్వహించిన క్యాంపులో 23,783 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేసినట్లు పశువైద్యాధికారి జీషన్‌అలీ తెలిపారు.

భూత్పూర్: మండలంలోని కాపరులు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి మధుసుదన్ తెలిపారు. గురువారం మండలంలోని తాటికొండ, పాతమొల్గర, మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో 13,326 గొర్రెలు, 435 మేకలకు నట్టల నివారణ మందులు తాపించినట్లు పశువైద్యాధికారి మధుసుదన్ తెలిపారు.

బదిలీ చేసినా.. వెళ్లని కార్యదర్శి

- బాధ్యతలు అప్పగించకుండా దాటవేత
- గ్రామాభివృద్ధికి ఆటంకం

మహమ్మదాబాద్: పంచాయతీ కార్యదర్శిని వేరే చోటుకు బదిలీ చేసినా ఆయన వెళ్లడం లేదు. వచ్చిన కొత్త కార్యదర్శికి బాధ్యతలను అప్పగించడం లేదు. దీంతో ఆ గ్రామాభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని నంచర్లకు చెందిన కార్యదర్శి వెంకటస్వామి చిన్నచింతకుంట మండలం ఉంద్యాలకు బదిలీ చేస్తూ గత నెల 28న కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈయన స్థానంలో ఉంద్యాల నుంచి కార్యదర్శి పాండురంగం నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. వెంకటస్వామి రిలీవ్ కావాల్సిందిగా గత నెల 30న ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేశారు. నంచర్ల పంచాయతీ కార్యదర్శిగా నియమించబడ్డ పాండురంగం ఈనెల 9న విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఆయన పంచాయతీ కార్యాలయానికి సంబంధించిన రికార్డులు, రికార్డు అయిన ఎంబీలు, చెక్ బుక్కులు అప్పగించలేదు. సర్పంచ్ అనసూయ అడిగినా ఈరోజు, రేపు అని చెబుతూ సమాధానం ఇస్తున్నాడు తప్పా బాధ్యతలు అప్పగించడం లేదు. ఏ పనులు చేయాలన్న తీర్మానాలు ఒక్కటి కూడా రికార్డులు అందుబాటులో లేవు. దీనిపై కార్యదర్శి పాండురంగం జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. కాగా వెంకటస్వామికి ఉంద్యాల పంచాయతీ చాలా దూరం అయినందున వెళ్లడం ఇష్టం లేదని తెలిసింది. దగ్గరి ప్రాంతంలో పోస్టింగ్ వచ్చేలా పైరవీలు చేస్తున్నాడని, అందుకే బాధ్యతలు అప్పగించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

డీపీఓకు ఫిర్యాదు చేశాం

పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి బాధ్యతలు అప్పగించని విషయం మా దృష్టికి వచ్చింది. అతనితో మాట్లాడితే దాటవేసే సమాధానం ఇచ్చాడు. చేసేది లేక డీపీఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇచ్చాం. – రూపేందర్‌రెడ్డి, ఎంపీడీఓ, గండేడ్

సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన



నవాబుపేట: సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణపై క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎంపీడీఓ శ్రీలత తెలిపారు. గురువారం మండలంలో రుద్రారంలో ఉపాధి హామీ పథకం అధికారులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, మహిళా సమాఖ్య సభ్యులకు మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, తడి చెత్త, పొండి చెత్త ఏర్పాటు, కంపోస్టు ఎరువుల తయారీ, వ్యక్తిగత పరిశుభ్రత కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో బద్రునాయక్, జ్యోతి, ప్రశాంత్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోమాల్ ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా పుష్పమ్మ

నవాబుపేట: మండలంలోని పోమాల్ సర్పంచ్ కృష్ణా అవినీతి ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్‌కు గురయ్యారు. దీంతో గురువారం ఉపసర్పంచ్ పుష్పమ్మకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు కలెక్టర్ రవినాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సర్పంచ్ అవి నీతి ఆరోపణలపై అధికారులు విచారిస్తున్నారు.

సంతు గాడ్గే బాబా జయంతి



మహబూబ్‌నగర్ రూరల్: సంఘసంస్కర్త సంతు గాడ్గే బాబా జయంతిని గురువారం జిల్లా కేంద్రంలోని జై భీమ్ చౌరస్తాలో నిర్వహించారు. బహుజన మహనీయుల శోభాయాత్ర కమిటీ కన్వీనర్ రమేష్ ఆధ్వర్యంలో చిత్రపటానికి దళిత, బహుజన కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పరమేశ్వర్, పురుషోత్తం, రాందాస్, శ్యామ్‌సుందర్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలాం డ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీధర్ ప్రకటనలో తెలిపారు. సైన్స్ అంటే ఇష్టమనే అంశంపై పాఠాలను, పోస్టర్ ప్రజెంటేషన్ ఆడుకునే బొమ్మలలో సైన్స్‌పై పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 26లోగా వివరాలను 7780274322, 9177216263 నంబర్‌కు పంపించాలని కోరారు.

ఐటీఐ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఐటీఐ కళాశాలలో పీఎంకేవై స్కిల్ హబ్ పథకం కింద కొత్త కోర్సులు ప్రవేశపెట్టామని, వాటిలో అడ్మిషన్ కోసం 19 నుంచి 40 ఏళ్ల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శాంతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఫోర్‌వీలర్ సర్వీస్, ఫ్యాబ్రికేషన్ వంటి సెక్టార్‌లలో అడ్మిషన్లు తీసుకోవాలనకునే వారు వచ్చే నెల 10వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



మాట్లాడుతున్న డాక్టర్ అనిల్

నవాబుపేట: విద్యార్థులు పరీక్షలు అనగానే భయపడి నిద్రహారాలు మాని చదవరాదని ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు అనిల్‌రాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ, జెడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సమాయత్తం అంశంపై మండల వైద్యాధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదవటం మానేసి ఇష్టపడి చదవాలని సూచించారు. చదువుపై ఇష్టం పెంచుకుని ముందుకు సాగితే లక్ష్యం నెరవేరుతుందన్నారు. కేవలం పరీక్షల సమయంలో చదివితే మార్కులు వస్తాయనుకోవటం కాదని, అందరూ శ్రద్ధగా చదవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్‌చంద్ర, శకుంతల, శరబలింగం, అవినాష్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

బ్యాటరీ కంపెనీని అడ్డుకోవద్దు



మాట్లాడుతున్న కౌన్సిలర్ కిశోర్‌కుమార్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లాలో అమరరాజా లిథియం బ్యాటరీల కంపెనీ రాకను కొందరు కావాలని అసత్య ప్రచారం చేస్తూ అడ్డుకునే ప్రయత్నం చేయడం తగదని కౌన్సిలర్ కిశోర్‌కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీఅతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అతిపెద్ద ప్రాజెక్టు జిల్లాకు రావడం ద్వారా దాదాపు 10 వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు దొరికే ఆస్కారం ఉందన్నారు. ఎలాంటి కాలుష్యం లేని కంపెనీని ఏర్పాటు చేయాలని కోరుతూ దివిటిపల్లి, ఎదిర, అంబటిపల్లి గ్రామస్తుల సమక్షంలో పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఎలాంటి అవగాహన లేక తాము ప్రశ్నించామని, తదనంతరం ఇతర ప్రాంతాల్లో కంపెనీ నిర్వహణ, కాలుష్యం, ప్రజాజీవనానికి ఇబ్బందులపై పరిశీలించామని, మూడు గ్రామాల ప్రజలు అమరరాజా లిథియం బ్యాటరీల కంపెనీని ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కోరుతున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు మానుకోవాలని సూచించారు. సమావేశంలో హన్మంతు, చెన్నారెడ్డి, ఎల్లయ్య, ముకరంజా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి కాలుష్యం ఉండదు

60 కోట్ల ప్రజలు నష్టపోయారు: కాంగ్రెస్



మాట్లాడుతున్న జి.మధుసూదన్‌రెడ్డి

పాలమూరు: ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ వంటి ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన డబ్బును తీసుకువెళ్లి అదానీ ఇతర దేశాల్లో షెల్ కంపెనీల పేరుతో పెట్టుబడులు పెట్టడంతో దేశంలో 60కోట్ల ప్రజలు దాదాపు రూ.44 వేల కోట్లు నష్టపోయారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఎల్ఐసీ కలిగి ఉన్న అదానీ గ్రూప్ స్టాక్‌ల విలువ 2022 డిసెంబర్ 30న రూ.83 వేల కోట్ల షేర్స్ ఉంటే 2023 ఫిబ్రవరి 15నాటికి రూ.39 వేల కోట్లకు పడిపోయిందన్నారు. 30 కోట్ల ఎల్‌ఐసీ పాలసీదారుల ఈక్విటీ హోల్డింగ్‌లలో రూ.44వేల కోట్ల క్షీణత ఏర్పాడిందన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 కంటే ముందు కేవలం గుజరాత్ రాష్ట్రానికి పరిమితం అయిన అదానీ ఆదాయంలో ప్రపంచంలో 659 స్థానం ఉండి.. మూడో స్థానానికి ఎలా వచ్చారని ప్రశ్నించారు. 2002 నుంచి ఇప్పటి వరకు అదానీకి దేశ ప్రధాని మోదీ సహకరించడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాడని తెలిపారు. ఎయిర్‌పోర్ట్‌లు, ఓడరేవులు ఇలా అన్నింటినీ ఆయన అధీనంలో ఉంటున్నాయన్నారు. అదానీ కుంభకోణంపై వెంటనే జాయింట్ పార్లమెంట్ కమిటీ వేసి విచారణ జరిపించాలన్నారు.కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, సిరాజ్‌ఖాద్రీ, బెనహర్, అజ్మత్, అవేజ్ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



కోయిల్‌కొండ: మండలంలోని పారుపల్లిలో గురువారం సీతారామ, లక్ష్మణుడి విగ్రహాలతోపాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను వేదమంత్రాల నడుమ చేపట్టారు. అంతకుముందు పురోహితులతో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

జెడ్పీ సీఈఓ సందర్శన



ఎంపీడీఓ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న జెడ్పీ సీఈఓ జ్యోతి

అడ్డాకుల: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ జ్యోతి గురువారం సందర్శించారు. కార్యాలయ రికార్డులను పరిశీలించి, మండల అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. గ్రామాల్లో చేపడుతున్న ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంజుల, సూపరింటెండెంట్ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.